మనోవ్యాధికి మందుంది

డాక్టరు మాధవరావు ఆ వూరొచ్చి ఐదారు నెలలే అయినా మంచిపేరు తెచ్చుకున్నాడు. బీదవాళ్లని ఎంతో దయగా చూసేవాడు. ఆహాస్పిటల్‌లో తనతో కలసి పనిచేస్తున్న లేడీడాక్టరు 'కమల' మొదట్లో ఇదంతా పేరుకోసం తెచ్చిపెట్టుకున్న ప్రవర్తన అనుకున్నా, తర్వాత తర్వాత ఆతనిపట్ల గౌరవభావం చూపసాగింది. ఆ రోజు మధ్యాహ్నం తను హాస్పిటల్‌కు రానని, డాక్టర్ మాధవరావుకి చెప్పేందుకు వెళ్లింది. అప్పుడే బయటికివచ్చిన డాక్టరు కమల రావటము చూచి వెళ్లకుండా నిల్చున్నాడు.

"డాక్టర్ నేను మధ్యాహ్నం రాను. మావాళ్ళ ఇంటికి వెడుతున్నా. సీరియస్ కేసులు ఏమీ లేవు" అని చెప్పింది. అంగీకారసూచకంగా నవ్వాడు డాక్టరు. ఇద్దరూ నడిచివస్తున్నారు. గేటుదాటించి వో ముసలివాడిని చిన్ని కుఱ్ఱాడు చెయ్యిపట్టుకు తీసుకురావడం డాక్టర్ చూశాడు. కుఱ్ఱాడు డాక్టరుకి చెప్పాలనుకున్నది చెప్పలేక, చేతిమీద చిరిగిన చొక్కాని రెండోచేత్తో పైకిలాగి పట్టుకుంటూ భయపడుతూ నిల్చున్నాడు.

ముసలివాడు కూడా అంతా రక్తంకారుతోంది. మోకాలు మీద చర్మం వ్రేలాడుతోంది. ఒంట్లోవున్న రక్తం అంతా అంతేనేమో అనిపించేటంత సన్నగా బలహీనంగా వున్నాడు.

"ఏమయింది?" అని కుఱ్ఱాణ్ణి అడిగాడు డాక్టర్.

"కుక్క కరిచిందండీ సార్" అనేందుకు రెండు నిమిషాలు పట్టింది.

"ఈవేళప్పుడు వస్తే ఎవరుంటారు? మేము ఇంటికెడుతున్నాం పైగా దీనికి ఇంజక్షను చాలా తీసుకోవాలి, బాధ పెడతాయికూడా. ఇంటికి తీసుకెళ్ళి కాకరాకు నూరి కట్టమను మీ

అవ్వని", అంది డాక్టర్ కమల. మాధవరావు నవ్వుతున్నాడు. "మనమే ఆరకం వైద్యం మొదలెడితే, హాస్పిటలు గదులు మరో సంస్థకి ఇచ్చి వెయ్యొచ్చు" - అంటూ ఆ వృద్ధుణ్ని లోపలకు తీసికెళ్ళి, కట్టుకట్టి, మర్నాడు కనపడమని చెప్పాడు మాధవరావు.

"డాక్టర్, మీరు వాళ్లు ఏటైమ్‌లో వొచ్చినా ట్రీట్ చేస్తారు. అందుకనే వాళ్ళు ఎప్పుడంటే అప్పుడొచ్చి వేధిస్తారు. ఆ కనికారం తోడివాళ్ళపైనవుంటే ఎంత బాగుండునో" అంది కమల హేళనగా. అన్ని అందులో కరుకుదనంలేదు. "మనం విసుక్కుంటే ఎల్లా? మన టైము కనిపెట్టి, వీడు ముసలి వాడు - బీదవాడు కాబట్టి వాణ్ణి కరుద్దాం. ఆ డాక్టర్లు ఏం చేస్తారోచూద్దాం అని కరుస్తుందంటారా కుక్క? మీరు మెడిసిన్ చదువకుండా స్కూలు టీచరుగా ఉండాల్సింది" అన్నాడు మాధవరావు నవ్వుతూ.

"నా మాటల్లా వుంచడం. మీరు ఏ ఫిలాసఫీ లెక్చరరుగానో వుంటే ప్రతిదాన్నీ చూసి జాలిపడుతూ, అవతల వాళ్లని కేవలం మీ మంచితంవల్ల బాధపెడుతూ వుండేవారేమో? మీ ఇంటికొచ్చి మీ ఆవిడతో చెప్పాలి. మిమ్మల్ని కాస్త చెడ్డవార్నిగా మార్చమని" అంది కమల పెద్దగా నవ్వుతూ.

"పొరపాటు. నన్ను మార్చమని చెప్పడం మర్చి మీరే మార్తారేమో ఆవిణ్ని చూసి" అన్నాడు మాధవరావు తనూ బిగ్గరగా నవ్వుతూ.

ఆ నవ్వులో ఆప్యాయత వుందనిపించింది కమలకి.

"చాలాటైమయింది. ఇంక వెళ్ళి కుకింగ్‌లో పడాలి" అంది కమల.

"పోనీ మా ఇంటికి రండి ఈ పూట" అన్నాడు.

కాదనలేకపోయింది. ఇంటికి వొచ్చారు ఇద్దరూ.

శకుంతలని కమలకి పరిచయం చేశాడు -

"ఈ పూట ఆవిడ కూడా మనతో భోంచేస్తారు" అన్నాడు.

శకుంతల ఎంతో నిండుగా నవ్వి "వడ్డించమంటారా" అంది.

"నన్ను మర్చిపోయావుకదూ?" అని ప్రశ్నార్థకంగా పలకరించింది కమల. శకుంతలకి వెంటనే గుర్తురాక తికమక పడింది. "నేనూ, చిట్టిని - మీరూ, మేమూ పక్క ఇళ్ళల్లోవుండే వాళ్ళం. ఇప్పుడు గుర్తొచ్చింది?"

"నువ్వా? చాలా మారిపోయావు సుమా!" అని ఆశ్చర్యంగా అంది శకుంతల. చాలాసేపు చిన్ననాటి ముచ్చట్లు మాట్లాడుకున్నారు ఇద్దరూ. మధ్యలో కమల డాక్టర్ కేసి చూసి "శకుంతల చిన్నప్పుడు చాలా బాగుండేది. ఇంతమందిని చూస్తున్నా. అంత అందంగా ఎవరూ కనపడలేదు" అంది. "ఆ అందంచూసే మోసపోయా" అన్నాడు మాధవరావు తమాషాగా నవ్వుతూ.

"అంటే ఇప్పుడు బాగా లేదని కదూ" అంది కమల. శకుంతల కుట్టిన కుట్లు, ఇల్లు సర్ది పెట్టుకోవటము అన్నీ శ్రద్ధగా చూస్తోంది. చంటిపిల్లని కమలకి చూపించింది. "చాలా నీ పోలికే కనిపిస్తోంది - ఆ గౌను కుట్టడం చాలా బాగుంది." అంది కమల.

"అమ్మాయిలు స్కూలుకెళ్ళారు. వాళ్లు వచ్చేదాకా ఉండకూడదూ" అంది శకుంతల. "ఇంకోసారి వస్తా" అని వెళ్ళిపోయింది కమల. కొన్ని రోజుల తరువాత వోనాడు కమల వొచ్చేసరికి డాక్టర్ ఇంట్లోనే వున్నాడు. "కూర్చోమని" కుర్చీ దగ్గరికి లాగాడు. శకుంతలవస్తే కాఫీ తెమ్మని పంపాడు. పెళ్లిళ్ల విషయం సంభాషణ మొదలుపెట్టాడు డాక్టర్.

"ఈ కాలంలో ఇద్దరూ వొకేవృత్తిలో వున్నవాళ్ళ పెళ్లి సుఖంగా వుంటుందను కుంటారు - మీరే మంటారు?" అన్నాడు డాక్టరు. ఈలోగా శకుంతల కాఫీ తెచ్చింది. చివరి

మాటలు విని ఎందుకో బాధపడినా, మొహములో కనపర్చలేదు. తను అక్కడ కూర్చోవాలో అక్కర్లేదో తోచక కాసేపు కుర్చీపట్టుకుని నిల్చుని లోపలికి వెళ్లింది - శకుంతల. సంభాషణ సాగలేదు. కమల వెళ్లిపోయింది.

ఇంకోరోజు కమలా, మాధవరావు వర్షంలో తడిసి చీకట్లో నడుచుకుంటూ ఇంటికి వచ్చారు. చాలా పొద్దుపోయింది. తలుపుతీసి శకుంతల, ఇద్దరూ అల్లా కలసిరావడం చూసి ఆశ్చర్యపడింది. మాధవరావు భోంచేస్తూ చెప్పాడు. అలా కొండల్లోకి . నడచి వెళ్ళామని, వర్షము పట్టుకోవడంవల్ల దారి తప్పామనీ, తిరిగి తిరిగి ఎల్లాగో ఇంటికి చేరామని - కమల కొంచెం ఖంగారు పడింది. శకుంతల ఏదీ గుర్తించనట్టు తలవంచుకు వడ్డిస్తోంది. వర్షం ఎక్కువయింది. ఉఱుములు మెరుపులతో భీభత్సంగా వుంది ఆకాశమంతా. "ఇంటికి వెడతా' ' నని బయలుదేరింది కమల.

'ఇప్పుడా? ఈ వెదర్‌లో ఎల్లా వెడతారు? ప్రొద్దున్న వెళ్లొచ్చుగా' అన్నాడు డాక్టర్.

రాత్రి అక్కడే సడుకుంది కమల.

ఉదయాన్నే కమల వెడతానని బైలుదేరింది.

"కాఫీ తాక్కుండా వెడతారా?" అన్నాడు డాక్టర్.

'బేబీని' పిల్చి కాఫీ తెమ్మన్నాడు. చిన్నకూతురు సుశీ పరుగెత్తుకుంటూ వచ్చి తూలి బల్లపైన పడింది. కమల కళ్ళ జోడు, పెన్ను కిందపడ్డాయి. మాధవరావు సుశీని కొట్టాడు. కిందపడ్డ అద్దం ముక్కలు తీసి కాగితంలో పెడుతున్నాడు. కాంపొండరు వచ్చి 'రాత్రి చేరిన పేషంటు పల్సు అందటం లేదు సార్" అని చెప్పి వెళ్లాడు. డాక్టర్ కొంచెం విసుక్కుని, అటూ, ఇటూ తిరిగి, బట్టలు మార్చుకు బైలుదేరాడు. కమలని కూడా రమ్మన్నాడు.

"ఆమెతో చెప్పి వస్తా" అని లేచింది.

"ఇప్పుడు కాదు, రండి తొందరగా- " అన్నాడు. బైటికి నడిచారు. పిల్ల ఏడుపు విని గదిలోకి వచ్చింది శకుంతల. కిటికీలోంచి ఇద్దరూ వెళ్ళడం కనిపించింది. వేపచెట్టుకింద పనిమనిషి మల్లయ్య లక్ష్మికి వాళ్ళని చూపించి నవ్వుతున్నాడు. లక్ష్మి ఏదో చెప్పబోయి కిటికీలో శకుంతలని చూసి తలవంచుకు వూడుస్తోంది. హాస్పిటల్ వెనకాలే వుంది ఇల్లు.

దారిపొడుగానా వేప చెట్లు. చింత చెట్లు వున్నాయి. రోగులకు తోడుగా మూలుగుతున్నట్లు గాలికి మఱ్ఱిచెట్టు వూడలు వూగుతున్నాయి.

శకుంతల మనస్సు చికాగ్గా వుంది.

హాస్పిటల్‌లో గోల వినిపించింది. లక్ష్మి పరుగెట్టు కెళ్లింది. మల్లయ్య కుర్చీలు తుడుస్తున్నాడు. శకుంతల్ని చూసి తుడిచేబట్టలు చేతులతో నలుపుతూ అన్నాడు - "మరి అండి, అందరూ అయ్యగార్ని గురించి ఆ అమ్మగోర్ని గురించి ఏటేటో అనుకుంటారండి...' ' అని ఇంకా ఏదో చెప్పబోయాడు.

'సర్లే, నీపని కానియ్యి' అని కసిరింది శకుంతల. ఆ రోజున మాధవరావుని అడగాలనుకుంది. కూడా మరో డాక్టరు రావడముతో వూరుకుంది.

ఇంకోరోజు కమల వచ్చేసరికి పిల్లలకి చక్కగా ముస్తాబు చేసింది శకుంతల. తను మంచి సిల్కుచీర కట్టుకుంది. కమల వోక్షణం అల్లా తెల్లపోయి చూసింది.

"ఈ చీర నువ్వు కట్టుకుంటే చాలా బాగుంది కదూ" అంది.

"ఎవరికైనా బాగుంటుంది" అంది శకుంతల.

"ఆడవాళ్ళు వకర్ని ఒకరు మెచ్చుకోరంటారు. మీ ధోరణి వేరుగా వుందే!" అన్నాడు

మాధవరావు ఏ వొకర్ని వుద్దేశించకుండా. "ఇద్దరూ అందమయిన వాళ్లు అయితే ఆ ఇబ్బంది; నాకు ఆ బాధ లేదులెండి" అంది కమల.

'అందంకంటే కూడా ఆకర్షణ, కళవుండాలి. అవి వున్నాయి అనుకుంటా మీలో' అన్నాడు మాధవరావు. ఆ మాటలు శకుంతల అనుమానాన్ని మరింతదృఢపరిచాయి. 'మేము సినిమాకి వెడదామనుకుంటున్నాము. మీరుకూడా వస్తారా' అన్నడు మాధవరావు కమలనుద్దేశించి.

చంటిపిల్ల ఉయ్యాల్లోంచి కిందపడి దెబ్బతగిలి ఏడుపు మొదలు పెట్టింది. శకుంతల సినిమాకి రానంది. మాధవరావు క్లబ్బుకి వేడతానని బైలుదేరాడు. కమలకూడా కారులో వెళ్ళింది.

కొంతసేపటికి కాంపౌడర్ వచ్చి 'మీ అన్నయ్యగారు ఫోనుచేశారు అండీ; మిమ్మల్ని వెంటనే రమ్మనమని- మీ అమ్మగారికి జబ్బుగావుందట, మిమ్మల్ని సిద్ధంగా వుండమన్నారు, డాక్టరుగారు వచ్చేసరికి!!' అమ్మ జబ్బుగా వుందనగానే కాళ్లు వణికాయి శకుంతలకి. కార్లోనే వెడదామన్నాడు మాధవరావు. బేబీని ముందు కూర్చోమని శకుంతల మిగిలిన పిల్లలూ పనిమనిషి లక్ష్మి వెనక కూర్చున్నారు. ఇంటికి చేరే సరికి అర్ధరాత్రి దాటింది.

ఇల్లు నిశ్శబ్దంగా వుంది. పిల్లలంతా నిద్రపోయారు. కార్లో. శకుంతలని దిగమని చంటిపిల్లల్ని తను ఎత్తుకున్నాడు. అప్పటిదాకా ఆపుకున్న దుఃఖము వక్కసారి పైకి వచ్చి శకుంతల ఏడుపు మొదలు పెట్టింది. అన్నగారు తలుపుతీసి, 'ఇప్పుడే నిద్రపట్టింది. ఇంక భయం లేదంటున్నారు డాక్టర్లు' అన్నాడు మెల్లగా. శకుంతల కళ్లు తుడుచుకుంటూ లోపలికి వెళ్ళింది.

'పొద్దేన్నే కూర్చున్నట్టే పడిపోయింది గుండెల్లో నెప్పి అంటూ! డాక్టర్ లాభంలేదన్నాడు. ఇంకో డాక్టరుని కూడా తీసుకువచ్చాడు. ఆయన కూడా అల్లా 'అంటేనే' మీకు ఫోను చేశా, రాత్రి పది దాటాక పల్సు నార్మలుగా వుంది. భయం లేదన్నారు" అని మాధవరావుకి చెప్పాడు.

రోగి కోలుకుంటుందన్న ధైర్యం చిక్కింది. మర్నాడు సాయంకాలానికి మాధవరావు, శకుంతల ఇంటికి చేరుకున్నారు పిల్లలతో. రాగానే మల్లయ్య రెండు కవర్లు తెచ్చి ఇచ్చాడు. "డాక్టర్ అమ్మగారు నాలుగ్గంటల బండికి వూరికి వెళ్లానని మీతోటి, అమ్మగారితోటి చెప్పమన్నారండీ".

మాధవరావు ఆశ్చర్యపడ్డాడు.

"నేను రాకుండానే తను వెళ్లడం ఏమిటి?... పేషెంట్సుని ఎవరు చూస్తారు?... ఇల్లాగే వుంటాయి ఆడవాళ్ల పన్లు" అని విసుకున్నాడు.

శకుంతల మొదట వుత్తరం చదవకూడ దనుకుంది. కాని చదవటము మొదలు పెట్టింది. ముందు అతనికి వ్రాసింది తీసింది. అందులో కాగితం చాలా చిన్నది. ఉద్యోగం మానేస్తున్నానీ, తర్వాత విపులంగా మళ్లీ వ్రాస్తాననీ వ్రాసి -తన్ని ఆదరంగా చూసినందుకు ధన్యవాదాలు చెప్పి ముగించింది. రెండో వుత్తరం తనకు పెద్దది. "చిన్నప్పుడు పిల్చినట్లు నిన్ను చిన్నా అని సంభోదిస్తాను. శకుంతలంటే కొత్తగా వుంటుంది.

నీకంటె పెద్దదాన్నైనా, నీలా ఆదరణ చూపటం నాకు చేతకాలేదు. నీతో ఎన్నో విషయాల మాట్లాడాలని తరచు మీ ఇంటికి వచ్చేదాన్ని - కానీ చెప్పకుండానే వచ్చేసేదాన్ని. అనుకోకుండా నీ మనస్సు నొప్పించానేమోనని ఇంటికివచ్చి బాధపడేదాన్ని.

చిన్నప్పుడు నీకు తెలుసుగా, నేనే నచ్చక చాలా మంది వచ్చి వెళ్ళిపోయ్యేవారు, పెళ్లి

కొడుకుల తాలూకువాళ్లు. తరువాత నాకు ఇష్టంలేక పెళ్లి చేసుకోలేదు. చాలామంది నా స్నేహితులు చదువు పూర్తికాకుండా పెళ్లిళ్ళు చేసుకున్నారు, కాని, కొన్నాళ్లకే ఏదోరకమైన అసంతృప్తి కనబరచేవాళ్లు. వాళ్లని చూస్తే నాలాంటివాళ్లకి ఈ జన్మలో పెళ్లి చేసుకోకూడదనిపించడం సహజం కదూ!. మీ ఇంటికి తరుచు రావటంవల్ల నేమో నాలో కొంత మార్పు వచ్చింది. నిన్నూ, పిల్లల్ని , నువ్వు సంసారం నడిపేరీతీ అన్నీ చూస్తే ఎంతో ముచ్చటగా వుండేది. నువ్వు ఎప్పుడూ నవ్వుతూ డాక్టరు ఏవేళప్పుడు వచ్చినా విసుగులేకుండా కావాల్సినవి అమర్చడం చూసి సంబరపడేదాన్ని. డాక్టరు అంత మంచివాడు కావడానికి నువ్వే కారణమనిపిస్తోంది నాకు. సహజంగా నీలోవున్న సంస్కారము చాలా మంది చదువుకున్నవాళ్లల్లో లేదేమో ననిపిస్తుంది నాకు.

నన్ను నాలుగేళ్లు క్రితం ఒకతను పెళ్ళి చేసుకుంటానన్నాడు. అప్పుడు నేను ఇష్టపడలేదు. కానీ అతను పెళ్ళి ఎందుకో చేసుకోలేదు. మా అక్కకి వరసకి మరిది అవుతాడు. ఇప్పుడు మా పెళ్లి నిశ్చయము చేసింది. మీరిద్దరూ పెళ్ళికి తప్పకుండా రావాలి. వీలుపడకపోతే మీలాగే జీవితం గడపాలని ఆశీర్వదిస్తారుకదూ? నేను చేసుకునే అతనిది అంత పెద్ద చదువుకాదు, ఆస్తివుంది. నాలో ఏ ప్రత్యేకతా లేకపోయినా నన్ను చేసుకోవాలనే వుందని విన్నాను. నీలా వోర్పుగా వుండేందుకు ప్రయత్నిస్తా. ఆరోజు వర్షంలో మేము రావటముచూసి నువ్వు కనక ఏమీ అనకుండా వుండగలిగావు. నేను వూహించుకుంటేనే కోపమువస్తోంది. ఇంకా ఏన్నో వ్రాయాలనుకున్నా. ఎల్లా వ్రాయాలో తెలీటంలేదు. నా హృదయపూర్వకంగా మీ ఇద్దరికీ నమస్కరిస్తున్నా. సెలవు. నాకంటె చిన్నదానివి గనక మళ్లీ ఆశీర్వదిస్తున్నా - నీ కమల.'
'

తరువాత మాధవరావు చదివాడు, శకుంతలకేసి చూశాడు నవ్వుతూ. శకుంతల కళ్ళు కిందికిదింపి నేలకేసి చూసి మళ్లా మొహం పైకెత్తి అతని కళ్లల్లోకి చూసింది. అందులో కన్నీటి బిందువు మెరిసింది.

✧